మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు.

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

పేదల జోలికొస్తే ఊరుకోం : కూనంనేని

సుబేదారి/పోచమ్మమైదాన్, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో, వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భగీరథ ఎస్ఈ మల్లేశ్

ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించాలి

గోవిందరావుపేట, అక్టోబర్ 1 : గ్రామాల్లోని ప్రజలకు భగీరథ నీటిని సక్రమంగా అందించాలని ఎస్ఈ మల్లేశ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో మంగళవారం ఎంపీడీవో జవహర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామాల్లోని మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మల్లేశ్ మాట్లాడుతూ గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ వాటర్ క్వాలిటీగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ సునీత, డీఈ గ్రిడ్ సతీశ్, ఏఈ హారిక, ఎంపీవో శరత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

మహాముత్తారం పీహెచ్‌సీ తనిఖీ

మహాముత్తారం, అక్టోబర్ 1 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో మధుసూదన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆస్పిరేషన్ బ్లాక్‌లో భాగంగా వైద్య సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యుడు సందీప్, డీపీవో చిరంజీవి, డీడీఎం మధుబాబు, సీహెచ్‌వో విద్యాసాగర్, సూపర్‌వైజర్ హేమలత, రమాదేవి ఉన్నారు

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ములుగురూరల్, అక్టోబర్ 1 : మల్లంపల్లిలో జీపీ వర్కర్‌గా పనిచేస్తున్న ఇనుముల సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీవో రామకృష్ణకు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఎండీ అమ్జద్‌పాషా మాట్లాడుతూ విధి నిర్వహణలో గాయపడిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి సదయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమేశ్, నాయకులు మామిడి సుధాకర్, ఓదెలు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 1 : ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలని కోరుతూ మంగళవారం మాలల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గంపల శివకుమార్ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాదనపల్లి చిట్టిబాబు, గోగూలమూడి హరికృష్ణ, కాల్వ సుందర్‌రావు, క్రిస్టియన్ దాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై మహిళా సంఘాలకు అవగాహన

మహదేవపూర్, అక్టోబర్ 1 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ఝాన్సీలక్ష్మీబాయి మహిళా సమాఖ్యలో మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులకు స్వచ్ఛత, పరిశుభ్రత అంశాలపై జీపీ కార్యదర్శి కల్పన అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల పై చెత్త చెదారం వేయొద్దని సూచించారు. ఏపీఎం రవీందర్, మహిళా సంఘాల అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

కేటీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

గణపురం, అక్టోబర్1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో మంగళవారం మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి ఆగినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతులు చేపట్టి పునరుదరించేలా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సారూ.. సమయపాలనేది?

- 10:30 అయినా రాని అధికారులు
- తహసీల్‌లో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

వాజేడు, అక్టోబర్ 1 : ప్రజలు, అధికారులతో కనిపించాల్సిన కార్యాలయం ఎవరూ లేక వెలవెలబోయింది. మంగళవారం 10:30 గంటలైనా తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. తహసీల్దార్‌తో సహా నాయబ్ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్ తదితర అధికారులు విధులు నిర్వర్తించే గదులు ఎవరూ లేక బోసిపోయాయి. అటెండర్‌తో కలిపి నలుగురు ఉద్యోగులు మాత్రమే విధులకు హాజరవడం విశేషం. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు అధికారులు ఎవరూ కనిపించకపోవడంతో వెనుదిరిగారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు స్థానికంగా ఉండకుండా నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో సమయపాలన పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ స్పందించి అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ గదిలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సమస్యలు పరిష్కరిస్తేనే ధాన్యం కొంటాం

- మంత్రి సీతక్కకు రైస్ మిల్లర్ల వినతి
- న్యాయమైన డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వేడుకోలు

ములుగు, అక్టోబర్1(నమస్తేతెలంగాణ):రాష్ట్రవ్యాప్తంగా రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తేనే ధాన్యం కొంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు.న్యాయమైన తమ డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాట్రగడ్డ సతీశ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి గోపు వాసుదేవరెడ్డి, కోశాధికారి ఆరె విజేందర్ మంత్రికి తమ సమస్యలను వివరించారు. 2017 నుంచి సీఎంఆర్, ట్రాన్స్‌ఫోర్టు, కస్టోడియన్ చార్జీలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని అన్నారు. జనవరి నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైస్ మిల్లర్లకు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సన్నవడ్ల మిల్లింగ్‌లో 67శాతం బియ్యం రావని, 55 శాతం మాత్రమే వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. 17శాతం తేమతో సన్నవడ్లను సేకరిస్తే మిల్లింగ్‌కు పనికిరాకుండా పోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అన్ని వడ్లను కలిపి మిల్లింగ్‌కు పంపినట్లయితే బియ్యం కూడా నాణ్యతగా రావని మంత్రికి వివరించారు. నాణ్యమైన డిమాండ్లను పరిష్కరించనట్లయితే వడ్లను రైస్ మిల్లుల వద్ద దింపుకోమని మంత్రికి తెలియజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి సివిల్ సప్లయ్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు రైస్ మిల్లర్లు వివరించారు.

మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

వీసీలో మంత్రి పొంగులేటి

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్, అక్టోబర్ 1 : ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి కలెక్టర్లు రాహుల్ శర్మ, దివాకర పాల్గొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు అమలుపై ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించా రు. వీసీ అనంతరం కలెక్టర్లు అధికారులతో మాట్లాడారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ కోసం జిల్లాలో ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో కేటాయించిన బృందాలకు అవసరమైన అవగాహన కల్పించాలని, ప్రతి రోజూ ఇళ్ల లక్ష్యాలను కేటాయించి ఉదయం, సాయంత్రం టీముల పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఆఫ్ లైన్‌లో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

ఇండ్లు మంజూరు చేయాలని వినతి

ములుగురూరల్, అక్టోబర్ 1 : అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరుతూ కలెక్టర్ టీఎస్ దివాకరకు ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ములుగులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు 35పూర్తి కావచ్చాయని, వాటిని నిరుపేదలకు అందించాలని కోరారు. ఆయనవెంట ఝాన్సీ, మున్నిబేగం ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మంగపేట, అక్టోబర్ 1 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన మద్దెల పాపారావు కుటుంబానికి మంగళవారం ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో రూ.16,600 ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాలసిన సహకారం సకాలంలో వచ్చేలా కృషి చేస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

పాపారావు కుటుంబానికి సాయం చేస్తున్న ఉద్యోగులు

సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించాలి

వాజేడు, అక్టోబర్ 1 : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మధుకర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి వైద్య చికిత్స పొందేలా అవగాహన కల్పించడంతో పాటు దోమతెరలు వాడేలా చూడాలని సూచించారు. సమావేశంలో పల్లె దవాఖాన వైద్యాధికారి జ్ఞానస, హెల్త్ సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు ,ఏఎన్ఎంలు ఛాయాదేవి, సత్య నాగవేణి, లలితకుమారి, కన్యాకుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

గోవిందరావుపేట, అక్టోబర్ 1 : మండలంలోని పస్రా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామపంచాయతీ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గొంది రాజేశ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అతలాకుతలంగా ఉందన్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వీధి లైట్లు వెలిగేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

చికెన్ సెంటర్ ధ్వంసం

కాటారం, అక్టోబర్ 1 : మండలంలోని దేవరాంపల్లి గ్రామ సమీప